

రెండు వజ్రాలు లభ్యం

తుగ్గలి, జూన్ 10: వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలకు సోమవారం రెండు విలువైన వజ్రాలు లభ్యమయ్యాయి. సోమవారం మండలంలోని పగిడిరాయి, చిన్నజొన్నగిరి గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలకు పగిడిరాయిలో దొరికిన వజ్రాన్ని గుత్తికి చెందిన వ్యాపారి రూ.4.50 లక్షలు, రెండు తులాల బంగారు ఇచ్చి కొనుగోలు చేశాడు. అదేవిధంగా చిన్నజొన్నగిరిలో దొరికిన వజ్రాన్ని స్థానిక వజ్రాల వ్యాపారి రూ.1.50 లక్షలు, 2 తులాల బంగారు ఇచ్చి కొనుగోలు చేశాడు.



- కీలక అధికారి కారు డ్రైవర్ అతి చేష్టలు
- సారు పేరు చెప్పి కారుకు ఉచితంగా ఇంధనం
- ప్రభుత్వ సొమ్మును మిగిలించుకునేందుకు ఎత్తులు
- వత్తాసు పలుకుతున్న అధికారి సహాయకుడు

జాదూ డ్రైవర్..!

మిగిలిన ఉద్యోగులతోనూ..

సాధారణంగా ప్రైవేటు ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగుల వద్ద కాస్త పద్ధతిగా ఉంటారు. కానీ సదరు ప్రైవేటు డ్రైవరు మాత్రం అందుకు భిన్నం. అధికారులకు సన్నిహితుడినంటూ తక్కిన ఉద్యోగుల వద్ద కాస్త దుడుకుతనం ప్రదర్శిస్తాడన్న పేరుంది. అంతేనా.. అక్కడ పనిచేసే కిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులను కూడా లెక్కచేయని విధంగా ప్రవర్తిస్తాడన్న విమర్శలున్నాయి. ప్రైవేటు డ్రైవరు ఈ విధంగా ఉండటం ఏమిటని కిందిస్థాయి ఉద్యోగులు విసుక్కుంటున్నా.. అధికారి వద్ద తమను లేనిపోని విషయాల్లో ఇరికిస్తాడేమోనని మిన్నకుండిపోతున్నారు. గతంలో పనిచేసిన మహిళా అధికారి తమ పట్ల ప్రవర్తించిన తీరును గుర్తు చేసుకుని పైస్థాయి అధికారి డ్రైవరుకు కూడా భయపడాల్సి వస్తోందని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆయన జిల్లాస్థాయిలో రెండో అత్యున్నత అధికారి వద్ద పనిచేసే ప్రైవేట్ డ్రైవరు. తన కారును అధికారి వద్ద అద్దెకు తిప్పేందుకు పెట్టాడు. ఆ తర్వాత డ్రైవరును పెడితే తనకేమీ మిగలదని తానే డ్రైవరుగా చేరాడు. గతంలో ఇక్కడ పనిచేసిన మహిళా అధికారి దందాలకు సహాయపడుతూ ఆమెకు నమ్మిన బంటులా మారాడు. దీంతో మిగిలిన అధికారుల వద్ద కూడా కొంచెం పరపతి పెంచుకున్నాడు. ఆమె అండ బాగానే ఉండటంతో కిందిస్థాయి ఉద్యోగుల వద్ద కూడా కొంచెం అతి చేష్టలు చేయడం మొదలుపెట్టాడు. అయితే ఆమె బదిలీపై వెళ్లిన తర్వాత కూడా డ్రైవరు పాత పద్ధతిని వదలలేదు. అధికారి పేరు చెప్పి ఉచితంగా వాహనానికి ఇంధనం నింపించుకోవడం చేస్తున్నాడు. ప్రభుత్వం ఇచ్చే నిధులను మిగిల్చుకునేందుకు అధికారి పేరును విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నాడు. ఈ విషయం అధికారికి తెలిసే జరుగుతోందా? లేదా? అని ఆరా తీసేవారు లేకపోవడంతో డ్రైవరు చేష్టలు మితిమీరుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నా..

సాధారణంగా అధికారులు జిల్లాలో తిరిగేందుకు ప్రభుత్వం వాహనాలను సమకూరుస్తుంది. అలా లేని పక్షంలో ప్రైవేటు వాహనాలను అద్దె ప్రాతిపదికన తీసుకుని నెలవారీ అద్దె చెల్లిస్తుంది. జిల్లా ఉన్నతస్థాయి అధికారుల కార్లకు నెలకు 2500 కి.మీ తిరిగినందుకుగాను రూ.60 వేలు చెల్లిస్తుంది. అద్దెకు కారును నడిపే యజమాని డ్రైవరును కూడా నియమించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత సదరు అధికారి కోసం కారును అద్దెకు తిప్పుతున్న వ్యక్తే, ప్రైవేటు డ్రైవరుగా కుదిరాడు. గత అధికారుల వద్ద సదరు ప్రైవేటు డ్రైవరుకు మంచి సాన్నిహిత్యం ఉండటంతో స్వామి కార్యం, స్వకార్యం చక్కబెట్టుకుంటూ వచ్చాడు. ప్రస్తుతం కూడా అదే చేస్తున్నాడు. అధికారి క్యాంపునకు వెళ్లినపుడు అవసరమైన ఇంధనాన్ని ఆయన పేరు చెప్పి నింపించుకుంటున్నాడు. కొద్ది రోజుల క్రితం ఓ పుణ్యక్షేత్రానికి వెళ్లినపుడు అక్కడ దేవస్థానం ఖాతాలో ఇంధనాన్ని నింపించుకున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రభుత్వం ఇచ్చే సొమ్మును మిగిలించుకునేందుకు సదరు అధికారి పేరును భ్రష్టు పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం అధికారి వరకు వెళ్లకుండా సదరు డ్రైవర్ జాగ్రత్తపడటం కొసమెరుపు.



ఆయనకు తోడుగా సహాయకుడు..!

సదరు అధికారి వద్ద ప్రైవేటు డ్రైవరు తీరు ఈ విధంగా ఉంటే.. అధికారి సహాయకుడి తీరు మరో విధంగా ఉంది. డ్రైవరు చేస్తే లేనిది తాను చేస్తే వచ్చిందా? అనుకుంటూ సదరు సహాయకుడు కూడా అధికారుల వద్ద డబ్బులు దండుకుంటున్నాడన్న ప్రచారం జరుగుతోంది. అధికారితో పని విషయంలో గానీ, ఇతర విషయాల్లో గానీ ఏదైనా అవసరం పడినపుడు సహాయపడతాడన్న ఉద్దేశంతో సహాయకుడికి అధికారులు అంతో ఇంతో ముట్టజెబుతున్నారని సమాచారం. గతంలో జిల్లాలో పనిచేసిన మహిళా అధికారి వద్ద పనిచేసినపుడు ఏదో మతలబు జరిగిందనే విషయంలోనే సదరు సహాయకుడిని పక్కన పెట్టిందనే ప్రచారం ఉంది. ఆమె స్థానంలో వచ్చిన అధికారి సదరు వ్యక్తిని మళ్లీ సహాయకుడిగా చేర్చుకున్నాడు. అయితే గతంలో జరిగిన విషయాలు తెలిసే ఆ అధికారి సదరు వ్యక్తిని సహాయకుడిగా తీసుకున్నాడా? లేక ఏమీ తెలియక తీసుకున్నాడా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే కార్యాలయంలో ఉన్నతస్థాయి అధికారుల సహాయకులు చేస్తున్న లీలలపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. కథనాలు వెలువడిన తర్వాత అధికారి సహాయకులను తొలగించాడు. ఇపుడు ఆయన తర్వాతి స్థాయి అధికారి వద్ద సహాయకుడిగా చేస్తున్న వ్యక్తిపై విమర్శలు రావటం గమనార్హం. దీంతో ఉన్నతస్థాయి అధికారుల వద్ద పని చేయడానికి వచ్చే వారంతా ఆదాయమార్గమని భావించి ఇక్కడకు వస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



సంగమేశ్వరం వద్ద వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

కొత్తపల్లి, జూన్ 10: అధికారంలోకి రానున్న నారా చంద్రబాబునాయుడు సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద రాయలసీమ ప్రజల హృదయ స్పందన అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవ వేడుకలు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. రాయలసీమ ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతు సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమ అభివృద్ధికి గత పదేళ్లుగా అధికారంలో ఉన్న టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు రాజ్యాంగం ఆదేశించిన విభజన చట్టం హామీలను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు సిద్ధేశ్వరం సహా రాయలసీమ నీటి పారుదల డిమాండ్లను పరిష్కరించలేదని అన్నారు. తెలుగుగంగ, గాలేరు, నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులకు భవిష్యత్తులో అరకొర నీరు మాత్రమే లభిస్తోందని అన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమ ప్రాజెక్టుల నిర్మాణం కోసం బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేపడితే.. 854 అడుగుల మేర నీరు నిల్వ ఉంటుందని, ఈ నీటితో రాయలసీమ ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంతో మంది ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పాలించినప్పటికీ రాయలసీమ అభివృద్ధి, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ఉనికిలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాజెక్టుల నిర్మాణానికి సరిగ్గా నిధులు కేటాయించకపోవడంతో రాయలసీమలో నికర జలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కొత్తగా అధికారంలోకి రానున్న తెలుగుదేశం ప్రభుత్వం ఈసారైనా సీమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని అన్నారు. 15 రోజుల్లో రాయలసీమ ప్రాజెక్టుల విషయంపై సీఎం చంద్రబాబును కలిసి సమస్యను వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు అరుణ్, విరసం నాయకులుపాణి, వరలక్ష్మి, ఎస్‌డీపీఐ, జనసేన తాహేర్ వలి, సీపీఐఎం శంకరయ్య, రాయలసీమ సాంస్కృతిక వేదిక, రాయలసీమ అభ్యుదయ సంఘం నాయకులు, రాయలసీమ సాంస్కృతిక వేదిక, రాయలసీమ అభ్యుదయ సంఘం, ఏఐకేఎస్ రాజశేఖర్, సీపీఐ ఆత్మకూరు బాధ్యులు శ్రీనివాసులు, ప్రజాస్వామ్య పరిరక్షణ హక్కుల వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, టీకేఎస్ కడప జిల్లా నాయకులు రంగారెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజా సంఘాల, రైతు సంఘాల నాయకులు



దెబ్బతిన్న ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ

ఎస్సార్బీసీకి గండ్లు

బలహీనపడిన కాల్వలు
నిర్వహణకు పైసా విదిల్చని వైసీపీ ప్రభుత్వం
25 వేల ఆయకట్టుకు అందని సాగు నీరు
అవస్థలు పడుతున్న రైతులు
పట్టించుకోని నీటిపారుదల అధికారులు

అవుకు, జూన్ 10 : శ్రీశైలం కుడిగట్టు కాల్వ (ఎస్సార్బీసీ)కు మొదటి నుంచీ నిర్లక్ష్యపు గండ్లు తప్పడం లేదు. శ్రీశైలం నుంచి కృష్ణా మిగులు జలాల నుంచి 19 టీఎంసీల నీటిని శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ ద్వారా నంద్యాల, కడప జిల్లాలోని 1.20లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందు కోసం 1985లో టీడీపీ ప్రభుత్వం ఎస్సార్బీసీ కాల్వ నిర్మాణం కోసం రూపకల్పన చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బనకచర్ల, గోరుకల్లు, బనగానపల్లె, అవుకు సంజామల, కోవెలకుంట్ల మీదుగా కడప జిల్లా మైలవరం డ్యాం వరకు 199 కిలోమీటర్లు, పొడవున ఎస్సార్బీసీ కాల్వను నిర్మించాలని తలపెట్టారు. గోరుకల్లు నుంచి మైలవరం డ్యాం వరకు 21 బ్లాక్‌లుగా విభజించి 1.90 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళికలు రూపొందించారు. అప్పట్లో రూ. 250 కోట్లు ఖర్చు చేసి బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి కడప జిల్లా కొండ సుంకేసుల వరకు 141 కిలోమీటర్లు మాత్రమే 1995 నాటికి పూర్తి చేశారు. ఎస్సార్బీసీ కాల్వ నీటి ప్రవాహ సామర్థ్యం 2100 క్యూసెక్కులు. ఈ కాల్వను 16 బ్లాక్‌లుగా విభజించి 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఎస్సార్బీసీ కాల్వ రూపుదిద్దుకుంది. ఇప్పటికీ కడప జిల్లా కొండ సుంకేసుల నుంచి మైలవరం డ్యాం వరకు 58 కిలోమీటర్ల మేర ఎస్సార్బీసీ కాల్వ పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఉమ్మడి ఏపీలో 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రైయల్ రన్ను మొదటిసారి నిర్వహించి 2005 నుంచి ఎస్సార్బీసీ కాల్వకు ప్రతిఏడా కృష్ణాజలాలలను వదులుతున్నారు. ఎస్సార్బీసీ కాల్వ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లైనింగ్ దెబ్బతినింది. పలుమార్లు గండ్లు పడ్డాయి.

ఎస్సార్బీసీ కాల్వ నిర్మాణం ఇలా.. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా మిగులు జలాలను 3.40 కిలోమీటర్ల దూరం వరకు అప్రోచ్ కెనాల్ ద్వారా తీసుకెళ్లి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు 16.34 కిలోమీటర్లు కాల్వ నిర్మాణం జరిగింది. బానకచెర్ల రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు వరకు 50 కిలో మీటర్ల వరకు ఐడియల్ రన్ (మధ్యలో ఎలాంటి ఆయకట్టు లేకుండా) నిర్మించారు. గోరుకల్లు వద్ద ఎస్సార్బీసీ కాల్వను 53.335 కిలోమీటరు నుంచి 116వ కిలో మీటరు అనగా అవుకు రిజర్వాయర్ వరకు అక్కడి నుంచి కడప జిల్లా కొండ సుంకేసుల వరకు మొత్తం 141 కిలోమీటర్ల పొడవునా ఎస్సార్బీసీ కాల్వను నిర్మించారు.

ఎస్సార్బీసీ కాల్వకు పదే పదే గండ్లు

బానకచెర్ల నుంచి ఎస్సార్బీసీ ద్వారా నీటిని తరలించేందుకు గోరుకల్లు వద్ద 12.46 టీఎంసీల నీటి నిల్వతో రిజర్వాయర్‌ను నిర్మించారు. అలాగే రిజర్వాయర్ వద్ద 4.148 టీఎంసీల నీటి నిల్వ ఉండేలా రిజర్వాయర్ నిర్మించారు. కాల్వకు గండ్లుపడే అవకాశం ఉన్నచోట్ల పటిష్ట చర్యలు చేపట్టి ఎస్కేప్ రెగ్యులేటర్ల వద్ద గ్రీజింగ్, ఆయిలింగ్ చేయడంతోపాటు ట్రయల్ రన్ చేసి లోపాలను సరిదిద్దుకోవాలి. అయితే ఎస్సార్బీసీ అధికారులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాల్వకు గండ్లు పడ్డాక హడావుడి చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సార్బీసీ కాల్వ నిర్వహణకు ఒక్క పైసా విదిల్చిన దాఖలాలు లేవు. 2006లో అవుకు మండలం రామవరం సమీపంలో పదో బ్లాక్ వద్ద గండి పడగా 2007లో మెట్టుపల్లె సమీపంలోని 111.5వ కిలోమీటరు రాయి వద్ద 60మీటర్ల గండి పడింది. 2013లో 230 కిలోమీటరు వద్ద 40మీటర్ల గండి, 2014 ఆగస్టు నెల 26న 9వబ్లాక్‌లో వెంకటాపురం గ్రామ సమీపంలో గండి, మరలా మూడు రోజుల వ్యవధిలో 2014 ఆగస్టు 29న 60 మీటర్ల గండి, 2016లో 111.250 కిలో మీటర్ల వద్ద గండ్లు పడ్డాయి. ఈవిధంగా గండ్లు పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

● ఎస్సార్బీసీ కాల్వను 16 బ్లాక్‌లుగా విభజించి 1.20లక్షల ఆయకట్టు నీరు అందించాలనేదే లక్ష్యం. 1-7 వరకు 30 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 8-11వ బ్లాక్ వరకు 47.491 వేల ఎకరాలు, 12-16 బ్లాక్ వరకు 42,509 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అయితే ఎస్సార్బీసీ కాల్వ దెబ్బతినడం పంటకాల్వలు సరిగా లేని కారణంగా 25వేల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఆయకట్టుకు నీరు అందని రైతులు వర్షాధారంపై ఆధారపడి మెట్టపంటలు సాగు చేసుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ఎస్సార్బీసీ కాల్వ పూర్తిగా దెబ్బతినింది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. నిధులు లేవని చెబుతూ కాల్వ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. నీటిని వదిలే సమయానికి కాల్వకు మరమ్మతులు చేపట్టాలి.
- గుడిపాటి శివ, రైతు అవుకు

వైభవంగా వెండి రథోత్సవం



స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, జూన్ 10: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహరతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం మహాక్షేత్రానికి సోమవారం తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. సోమవారం వేకువజాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టనందు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం త్రాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. క్షేత్రపరిధిలోని సత్రసముదాయాలు రద్దీగా కనిపించాయి.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

కర్నూలు అర్బన్/డోన్, జూన్ 10: టీడీపీ అధినేత, కాబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమవారం రాత్రి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో పాణ్యం, నందికొట్కూరు, డోన్ ఎమ్మెల్యేలు గౌరు చరిత, గిత్తా జయసూర్య, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా యువనేత నారా లోకేశ్‌ను ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి కలిసి అభినందనలు తెలియజేశారు.



చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, జయసూర్య, కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డీఎస్సీపై ఆశలు

● రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం ● ఉమ్మడి జిల్లాలో 1541 ఖాళీలు



కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 10: ఉపాధ్యాయ నియామకం భర్తీ ప్రక్రియ (డీఎస్సీ)పై నిరుద్యోగ అభ్యర్థులు కళ్లలో ఒత్తిళ్లు వేసుకుని ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను ఊరించి మోసం చేసింది. అనంతరం ఎన్నికలకు వెళ్లింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి చెంది.. ఎన్డీయే కూటమి విజయఢంకా మోగించింది. అయితే.. ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే మొదటి సంతకం చేస్తాననీ నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడమే కాదు.. పోస్టుల సంఖ్య పెంచుతాననీ హామీ ఇచ్చారు. ఈ నెల 12న అమరావతిలో అట్టహాసంగా ఎన్డీయే కూటమి తరుపున టీడీపీ తరుపున జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ కార్యక్రమంలోనే డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని మేనిఫెస్టోలో ప్రకటించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారో.. లేదో చూడాలి.

● పాఠశాలల విలీనంతో తగ్గిన పోస్టులు

గత వైసీపీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను కిలో మీటరు దూరంలో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మిగిలిన 1, 2 తరగతుల విద్యార్థులను అక్కడే ఉంచి బోధన కొనసాగిస్తున్నారు. అక్కడ పని చేస్తున్న మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. అలాగే పదిలోపు విద్యార్థుల సంఖ్య ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసివేసి, సమీపంలో ఉన్న పాఠశాలల్లో ఆ విద్యార్థులను చేర్పించారు. ఫలితంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న దాదాపు 340 పైగా ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఈ పాఠశాలల్లో పని చేస్తున్న వెయ్యి మందికి పైగా ఉపాధ్యాయులపైన విలీన ప్రభావం పడింది. 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. పాఠశాలల విలీనంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు అభ్యంతరం చెప్పడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 70 పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపివేశారు.

● త్వరగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేయాలి

మాది స్వస్థలం కోడుమూరు మండలం, కలపరి గ్రామం. 2016లో బీఎస్సీ, 2019-20 సంవత్సరంలో కర్నూలు రాయలసీమ క్రిస్టియన్ కళాశాలలో బీఈడీ పూర్తయింది. 2021-23 సంవత్సరంలో రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ కోర్సు పూర్తి చేసి డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్నాం.కొత్త ప్రభుత్వం కాలయాపన చేయకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేయాలి. ఇప్పటికే గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టెట్ ప్రక్రియను పూర్తి చేసింది. కొత్త ప్రభుత్వం మరికొందరికి అవకాశం కల్పించాలనుకుంటే టెట్ కమ్ టీఆర్‌టీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలి.

- ప్రతాప్, నిరుద్యోగి (ఎంఎస్సీ, బీఈడీ)



● ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి:

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లాలో 1541 పోస్టులను చూపించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో విలీనం చేసిన తరగతులను తిరిగి యథావిధిగా కొనసాగించాలని కోరుతున్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:30 ప్రకారం కాకుండా 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పదోన్నతుల్లో భాగంగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగానూ, స్కూల్ అసిస్టెంట్లకు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించడంతో భారీ ఎత్తున సెకండరీ గ్రేడ్ టీచర్ల కొరత ఏర్పడింది. ఈ ఎస్జీటీల సంఖ్యను పెంచి కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి త్వరితగతిన భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

● కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ

డీఎస్సీపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు దీర్ఘకాలంగా పట్టణాల్లో ఉండే కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ఆర్థికంగా భారమైనప్పటికీ విధిలేని పరిస్థితుల్లో శిక్షణ పొందుతుండగా.. మరికొంత ప్రైవేటు ఉద్యోగాలను వదులుకుని డీఎస్సీని ప్రిపరేషన్ అవుతున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ప్యాపిలి, జూన్ 10: మండలంలోని రాచెర్ల గ్రామం సమీపంలోని ఓ పొలంలో దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. నాలుగైదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని నేరేడుచెర్లకు చెందిన రైతు శ్రీనివాసులుకు రాచెర్లలో మూడు ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో పురాతన చెట్టు, కట్టు, తొట్టి ఉంది. అవుకు మండలంలోని ప్రసిద్ధ కంబగిరిస్వామి పుణ్యక్షేత్రం వెళ్లాలంటే భక్తులు ఈ పొలం పక్కన ఉన్న రహదారి గూండానే వెళ్లాల్సి ఉంది. పూర్వం కాలినడకన వెళ్లే భక్తులు ఈ చెట్టు కింద కూర్చొని నీరు సేవించి వెళ్లేవారు.. దీంతో దుండగులు ఇక్కడ గుప్త నిధులు ఉంటాయనే భావనతో తవ్వకాలు జరిపారని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుప్త నిధులు తవ్వే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతు శ్రీనివాసులు పోలీసులను కోరుతున్నారు.



గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపిన ప్రాంతం

వైద్య విద్యార్థుల ఆందోళన



కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద వైద్య విద్యార్థుల ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), జూన్ 10: ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న తేజేశ్వర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడంటూ వైద్యవిద్యార్థులు సోమవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రవేశ ద్వారం వద్ద ధర్నా చేశారు. దాదాపు గంట సేపు నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు మాట్లాడుతూ మెడికల్ కాలేజీ విద్యార్థి మృతి చెంది ఒక రోజు అయినా అధికారులు ఎవరూ స్పందించడం లేదన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ సర్కిల్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. అలాగే 24 గంటలు నిరంతరం ట్రాఫిక్ పోలీసులను ఉంచి ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. సీసీ కెమెరా కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రి నుంచి రాజ్‌విహార్ వరకు ఆర్టీసీ బస్సులు, ఆటోల వేగాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు.

19న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూన్ 10: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు, ఎంపీలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయశాఖ, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల శాఖపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య

చాగలమర్రి, జూన్ 10: మండలంలోని తోడెండ్లపల్లెకు చెందిన భాగ్యాలు (28) అనే మహిళ ఇంటిలో ఉరి వేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. భాగ్యాలు పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలోని ఓ వ్యక్తితో వివాహం చేసుకుంది. భర్తను వదిలేసి తోడెండ్లపల్లెలోని తల్లిదండ్రుల వద్ద నివాసం ఉంటోంది. ఇంటి పక్కనే ఉన్న వారితో మాట మాట పెరిగి వాగ్వివాదానికి దిగారు. ఈ విషయంలో భాగ్యాలు మనస్థాపానికి గురై ఇంటిలోనే తాడుతో ఉరి వేసుకుంది. మృతురాలు భాగ్యాలు తండ్రి నడిపి జయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సిల్వర్‌జూబ్లీలో ప్రవేశాలకు పరీక్ష

● టీఎస్, ఏపీ విద్యార్థులు అర్హులు



మాట్లాడుతున్న క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి సాయిగోపాల్

కర్నూలు(అర్బన్), జూన్ 10: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటైన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు జూలై 7న పరీక్షలు నిర్వహిస్తామని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. సోమవారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో ఎంతో చరిత్ర ఉన్నఈ కళాశాల గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా మరింత నాణ్యమైన విద్యను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదివిన ఎందరో ఐఎస్ఎస్, ఐపీఎస్‌లు అయ్యారని గుర్తు చేశారు. సిల్వర్‌జూబ్లీ సెట్ 2024 పరీక్ష ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు ఈనెల 4న గడువు ఉండటంతో ఆ సమయాన్ని ఈనెల 23 వరకు పొడిగించామని తెలిపారు. ఈ పరీక్షను అన్ని జిల్లాల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు, ఆధ్యాపకులు, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి వరద



శ్రీశైలం, జూన్ 10: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి సోమవారం వరద ప్రవాహం స్వల్పంగా నమోదయింది. సోమవారం ఉదయం 7 గంటల సమయానికి జూరాల నుంచి 4,052 క్యూసెక్కులు వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 809 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 33.7180 టీఎంసీలుగా ఉంది.

అశ్రునయనాలతో టీడీపీ కార్యకర్తకు వీడ్కోలు

● నివాళులర్పించిన నాయకులు



గిరినాథ్ చౌదరి అంత్యక్రియలకు తరలి వచ్చిన టీడీపీ నాయకులు



గ్రామంలో భారీగా మోహరించిన పోలీసు బలగాలు

వెల్దుర్తి, జూన్, 10: వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో ఆదివారం హత్యకు గురైన గిరినాథ్‌చౌదరి అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. సోమవారం ఉదయం పోస్టు మార్టం అనంతరం భౌతిక కాయాన్ని కర్నూలు ఆసుపత్రి నుంచి బొమ్మిరెడ్డిపల్లెకు తీసుకువచ్చారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, ప్రత్యేక బలగాలతో గ్రామంలో భారీ బందోబస్తు మధ్య దహన సంస్కారాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి.

గ్రామంలో భారీ బందోబస్తు

గిరినాథ్ హత్య అనంతరం బొమ్మిరెడ్డిపల్లె గ్రామాన్ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సంఘటన స్థలాన్ని ఆదివారం రాత్రి పరిశీలించారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, దిశా డీఎస్పీ బాబు ప్రసాద్, పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇంటలిజెన్స్ ఎస్పీ లతామాధురిలతోపాటు సీఐలు 15 మంది, నలుగురు ఎస్ఐలతోపాటు ప్రత్యేక బలగాలు, కేంద్ర బలగాలు, కలిపి 250 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

కుటుంబ సభ్యులకు ఓదార్పు

కర్నూలు సర్వజన వైద్యశాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ సంతాపం తెలియజేశారు. టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు గిరినాథ్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని తండ్రి రామాంజనేయులు, చిన్నాన్న సుబ్బరాయుడులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

16 మందిపై కేసు నమోదు


గిరినాథ్ హత్యలో ప్రమేయమున్న 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన రమేష్, రామకృష్ణ, చిన్నపామయ్య, ప్రవీణ్, చంద్రశేఖర్, మధుసూదన్ రెడ్డి, ఆనంద పద్మనాభరెడ్డి, చక్రపాణిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, మురళీరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, చైతన్యరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

ఎస్ఐ, సీఐలపై వేటు...

శాంతిభద్రతల పరిరక్షణలో ఉదాసీనంగా వ్యవహరించిన వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిలపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వేటు వేశారు. వీరిద్దరిని వీఆర్‌కు పంపారు. వీరి స్థానంలో సీఐ మధుసూధనరావు, ఎస్ఐ సునీల్ కుమార్‌లు పదవీ బాధ్యతలు చేట్టారు. వైసీపీ ముద్ర ఉన్న నేపథ్యంలో బదిలీ వేటు పడినట్లు సమాచారం.

వైసీపీ మూకల అరాచకం

- **టీడీపీ విజయాన్ని జీర్ణించుకోలేక దాడులు**
- **గ్రామాల్లో వైసీపీ కార్యకర్తల దౌర్జన్యకాండ**
- **బొమ్మిరెడ్డిపల్లెలో గిరినాథ్ చౌదరి దారుణ హత్య**
- **ప్రతిఘటిస్తే టీడీపీ శ్రేణుల దాడులంటూ దుష్ప్రచారం**





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

కర్నూలు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు టీడీపీ శ్రేణులు, సానుభూతిపరులపై దాడులకు దిగుతున్నారు. వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో టీడీపీ యువ నాయకుడు గిరినాథ్ చౌదరిపై వేటకొడవళ్లతో దాడి చేసి అతి కిరాతకంగా హతమార్చడమే ఇందుకు నిదర్శనం. ఇదొక్కటే కాదు పలు గ్రామాల్లో వైసీపీ మూకలు దౌర్జన్యకాండకు దిగుతున్నాయి. ప్రతిఘటిస్తే.. టీడీపీ శ్రేణులే దాడులు చేస్తున్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నాయి.

● వైసీపీ 2019 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ విజయాన్ని అందుకుంది. అదే క్రమంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొట్టారు. దౌర్జన్యాలు, భూ ఆక్రమణలకు తెగబడ్డారు. ప్రశ్నించిన బాధితులు, టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. జగన్ ప్రభుత్వం అండతో వైసీపీ శ్రేణులు ఐదేళ్లు అరాచకాలు సాగించాయి. ఇవి జీర్ణించుకోలేని ప్రజలు ఓటు అస్త్రాన్ని సంధించారు. వైసీపీ నేతలు కలలో కూడా ఊహించని దారుణ ఓటమిని రుచి చూపించారు. జిల్లాలో కర్నూలు, నంద్యాల ఎంపీలు సహా 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు టీడీపీ శ్రేణులపై దాడులకు దిగుతున్నారు. పలు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు.

● టీడీపీ నేత దారుణ హత్య:

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో పోలింగ్ రోజున వైసీపీ నాయకుల అరాచకాలను ప్రశ్నించారని కసి పెంచుకుని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మోదుపల్లి రామాంజనేయులు కుమారుడు, టీడీపీ యువ నాయకుడు గిరినాథ్ చౌదరిని దారుణంగా హత్య చేశారు. హతుడు టీడీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి సుబ్బరాయుడు స్వయాన అన్న కొడుకు. పోలింగ్ రోజున గిరిధర్ చౌదరి, తదితరులు వైసీపీ కార్యకర్తల అరాచకాలను, దౌర్జన్యాలను ప్రశ్నించి గట్టిగా అడ్డుకున్నారని కసి పెంచుకున్న వైసీపీ నాయకులు ఆదివారం గిరినాథ్ చౌదరి, కళ్యాణ చక్రవర్తి అన్నదమ్ములపై వేటుకొడవళ్లతో దాడి చేశారు. గిరిధర్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా.. కళ్యాణ చక్రవర్తి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనను టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు తీవ్రంగా ఖండించారు. బాధితులను పరామర్శించారు.

జిల్లాలో జరిగిన సంఘటనలు కొన్ని:

● కోడుమూరు మండలం గోరంట్ల మజరా గ్రామం కొత్తపల్లి గ్రామంలో వైసీపీకి 20 ఓట్ల మెజారిటీ వచ్చింది. టీడీపీ నాయకులు గట్టిగా పని చేయడం వల్లే వైసీపీ మెజారిటీ భారీగా తగ్గిందని కోపం పెంచుకున్న వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్త చిన్న మద్దిలేటి సహా మరో ఐదుగురు ఇళ్లపై దాడులు చేశారు. మద్దిలేటి తీవ్రంగా గాయపడ్డారు.

● కోసిగి మండలం పెద్దభూంపల్లి గ్రామంలో జూన్ 4న టీడీపీ నాయకులు చిర్తపల్లి ఈరన్న, జనార్దన్, పైఇంటి లక్ష్మి ఇళ్లపై వైసీపీ నాయకులు వేటకొడవళ్లతో దాడులు చేశారు. ఈ దాడిలో గ్రామ సర్పంచ్ బురుగేని అంజినేయ సహా తొమ్మిది మంది వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నట్లు గ్రామస్థులు అంటున్నారు. టీడీపీ నాయకులు తీవ్ర గాయాల పాలయ్యారు.

● ఆదోని మండలం అలసందగుత్తి గ్రామంలో టీడీపీ కూటమి తరుపున పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి డా.పార్థసారథికి 66 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇది వైసీపీ నాయకులకు మింగుడు పడలేదు. అదే క్రమంలో కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలవడం, రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఇది జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. పలువురిని గాయపరిచారు. వాస్తవం ఇలా ఉంటే.. టీడీపీ కార్యకర్తలే దాడులు చేశారని ఓటమి చెందిన నాయకుడు పేర్కొనడం కొసమెరుపు.

● ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలో టీడీపీ గెలవడంతో ఆ పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బాణాలు ఎలా కాలుస్తారని వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు.

● అలాగే గూడూరు మండలం ఆర్.కానాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడులకు దిగారు. ఇప్పటికైనా పోలీసులు పల్లెల్లో నిఘా పెంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



వెల్దుర్తి మండలంలో మృతి చెందిన గిరినాథ్ చౌదరి(ఫైల్)



గాయపడిన కళ్యాణ చౌదరి

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ సేవలో పాల్గొన్న అధికారులు, భక్తులు

మహానంది, జూన్ 10: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పరమశివుడు అయిన మహానందీశ్వరునికి పల్లకీ సేవను భక్తుల సమక్షంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకీపై మహానందీశ్వర స్వామి కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదమంత్రాలతో ఆశీనులు చేశారు. వేదపండితులు, అర్చకులు భక్తిశ్రద్ధలతో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవను భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



సుంకాల పరమేశ్వరీదేవికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్, జూన్ 10: కరివేన గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి ఆలయంలో ఆలయ 11వ వార్షిక వేడుకలను సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం సుంకులా పరమేశ్వరి అమ్మవారికి 9 కలశాలతో అభిషేకాది క్రతువులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించి, గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో వేదపండితులు మహేష్ శర్మ, రామకృష్ణ శర్మల పర్యవేక్షణలో దంపతుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చండీ హోమం, గణపతి హోమం, రుద్రహోమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని గాయత్రీమాత ఆలయం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలను పూర్ణాహుతితో ముగించారు.

ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన సీపీఎస్ ఉద్యోగులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్నసీపీఎస్ ఉద్యోగులు

వెలుగోడు, జూన్ 10: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డిని సోమవారం సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు వేల్పనూరులోని ఆయన స్వగృహం కలిశారు. ఈ సందర్భంగా బుడ్డాను ఘనంగా సన్మానించారు. సీపీఎస్ ఉద్యోగులపై ఉన్న కేసుల గురించి ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జమీర్ అబ్బాస్, జిల్లా బాధ్యులు రాజేష్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఇన్‌చార్జి సెక్రటరీకి అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ రహత్ జబ్బార్

నందికొట్కూరు, జూన్ 10: నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి షేక్ రాహత్ జబ్బార్ రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మార్కెట్ యార్డు ఇన్‌చార్జి సెక్రటరీ రామచంద్రయ్యకు అందజేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

కొత్తపల్లి: నాగంపల్లి సహకార సొసైటీ సింగిల్ విండో చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, డైరెక్టర్లు అచ్చిరెడ్డి, చంద్రమోహన్ తమ పదవులకు రాజీనామా చేశారు. సోమవారం కొత్తపల్లిలోని స్థానిక సొసైటీ భవనంలో సీఈవో కోటేశ్వరరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

గడివేముల: గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి తమ పదవులకు సోమవారం రాజీనామా చేసినట్లు సీఈవో ఆదినారాయణ తెలిపారు. గత మూడేళ్ల క్రితం బిలకలగూడురు గ్రామ వైసీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి చైర్మన్‌గా, గడివేముల వైసీపీ నాయకుడు వెంకటేశ్వర్లు, వండుట్ల వైసీపీ నాయకుడు రవీంద్రారెడ్డి డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టారు. అయితే వీరు తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు సీఈవో తెలిపారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూన్ 10: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, బ్యాంకులలో పంట రుణాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరులోని కార్యాలయంలో రైతుల సమావేశం సీపీఎం నాయకులు ఫక్కీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేయడం లేదన్నారు. ఈ ఏటా రుతుపవనాలు ముందుగా రావడంతో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని, సరిగ్గా ఈ సమయంలో విత్తనాల సమస్య తలెత్తిందని అన్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రైతులకు మొక్కజొన్న, పత్తి, మినుములు, మిరప, ఉల్లి విత్తనాలు ఎరువులు అందించాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగన్న, రైతులు రాజు, నాగస్వామి, తిరుపతయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే వణుకే

- వాగులు పొంగి ప్రవహిస్తే పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- భయాందోళనలో ప్రజలు
- ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఎదురుచూపులు



ఇటీవల భారీ వర్షానికి వడ్డెమాను గ్రామం వద్ద వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయిన దృశ్యం



ఇటీవల మిడుతూరు గ్రామం కాకిలేరు వాగు పొంగి పొర్లడంతో కొట్టుకు పోతున్న కారును ట్రాక్టర్‌తో లాగుతున్న దృశ్యం



పాములపాడు మండలంలోని ఇస్కాల వద్ద పొంగి పొర్లుతున్న వాగు (ఫైల్)

నందికొట్కూరు రూరల్ జూన్ 10: వర్షాకాలం వచ్చి వాగులు పొంగాయంటే చాలు నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. బయటి ప్రపంచంతో ఆ గ్రామాలకు సంబంధాలు తెగిపోతాయి. వాగులు పొంగాయంటే చాలు ఆయా గ్రామాల ప్రజలకు గుండెల్లో గుబులు మొదలవుతుంది. నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లా లన్నా, అత్యవసర పరీక్షలున్నా, అత్యవసర వైద్యసదుపాయం పొందాలన్నా బయటి గ్రామాలకు, పట్టణాలకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతుంది. ఇది ఇప్పటి సమస్యకాదు చాలా ఏళ్ల నుంచి ఇలాగే నెట్టుకొస్తున్నారు. నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను, మిడుతూరు మండలంలోని చింతలపల్లె, మిడుతూరు, జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల, పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామం, కొత్తపల్లె మండలంలోని శివపురం గ్రామం వద్ద, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి. వాగులు పొంగాయంటే చాలు ఈ గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పవు. కొన్నేళ్ల క్రితం లో లెవెల్ బ్రిడ్జిలు, రాతి కట్టడాల వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయ ప్రజలు చెబుతున్నారు. తుపానులు వర్షాల వల్ల భారీ వరదలు వస్తే కనీసం తెప్పలు వేసుకుని వెళ్లడానికి కూడా సాధ్యం కాని పరిస్థితి ఈ గ్రామాల ప్రజలది. గత కొద్దిరోజుల క్రితం కురిసిన వర్షానికి మిడుతూరు మండలం మిడుతూరు గ్రామం సమీపంలో కాకిలేరు వాగు పొంగి రాకపోకలు నిలిచిపోగా అందులో కారు అదుపు తప్పి కొట్టుకు పోతుండగా గ్రామస్థులు ట్రాక్టర్ సాయంతో తాళ్ల కట్టి లాగారు. ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి భయపడ్డారు. నంది కొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, అల్లూరు సమీపంలో వడ్డె మాను వద్ద వాగు పొంగితే వడ్డెమాను గ్రామానికి అల్లూరు, బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి సంబంధాలు తెగిపోతాయి. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల సమీపంలో గల ఇసుక వాగు పొంగితే అటువైపు నుంచి వెలుగోడు, వాడాల, తూడిచెర్ల, పారుమంచాల గ్రామస్థులు ఈ రోడ్డువెంటే రావాల్సి ఉంటుంది. ఇటువైపు నుంచి అన్నిరకాల రాకపోకలు నిలిచిపోతాయి. పాములపాడు మండలంలోని ఇస్కాల సమీపంలో వరదలు వస్తే ఆ గ్రామానికి రాకపోకలు ఆగిపోతాయి. కొత్తపల్లె మండ లంలోని దుద్యాల సమీపంలో సుద్దవాగు పొంగడంవల్ల కొత్తమాడుగు, కొక్కరంచ, ఎదురుపాడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేరు. అలాగే శివపురం నుంచి మిట్టమీది లింగాపురం వెళ్లే దారిలో పెద్దవాగు పొంగితే చాలా గ్రామా ప్రజలు రాకపోకలు సాగించలేరు. వరదలు వస్తే కొన్ని రోజుల పాటు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ గ్రామాలకు సరైన మార్గాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్



నందికొట్కూరులో కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు

నంద్యాల కల్చరల్, జూన్ 10: నంద్యాలలోని ఖలీల్ టాకీస్‌లో సినీహీరో, హిందూపురం హ్యాట్రిక్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు మాజీ మంత్రి, నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ అభిమానుల సముక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఫరూక్, ఫిరోజ్ మాట్లాడుతూ నేటి తరంలో సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాల్లో నటించి మెప్పించిన ఏకైక నటుడు బాలకృష్ణ అని అన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ద్వారా వేలాదిమంది ప్రాణాలకు కాపాడిన మహోన్నత వ్యక్తి నందమూరి బాలక్రిష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను నందికొట్కూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో బాలకృష్ణ అభిమానుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మాసుంబాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పాలు, బ్రెడ్లు పంపిణీ, 20 మంది యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణ అభిమానుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీను, ఉసేన్, టీడీపీ నాయకులు ముర్తుజావలి, లాయర్ జాకీర్, కళాకార్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ప్రసాద్ సేవలు భేష్: ఎస్పీ

నంద్యాల క్రైం, జూన్ 10: హోంగార్డు వీవీడీ ప్రసాద్ విధినిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా సేవలందించారని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి కొనియాడారు. నంద్యాల జిల్లాలోని నంద్యాల హోంగార్డు యూనిట్‌లో హోంగార్డుగా వీవీడీ ప్రసాద్ 1982లో చేరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేశారని, ఆయన శేషజీవితం సాఫీగా సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వహించడం గొప్ప విషయమని, హోంగార్డులు, పోలీసులు ఒకే కుటుంబ సభ్యులన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రసాద్‌ను ఎస్పీ, ఇతర అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. డీపీవో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిజాముద్దీన్, ఎస్పీ సీసీ నాగరాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్, హోంగార్డు ఇన్‌చార్జి జమాల్, హోంగార్డులు రవికుమార్, బొబ్బిలి, నరసింహులు, మేరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జిష్ణునాగవిజయ్

ఆత్మకూరు, జూన్ 10: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా భౌతికశాస్త్రం అధ్యాపకుడు జిష్ణునాగవిజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వెంకటనర్సయ్య మే 31వ తేదిన రిటైర్డు కావడంతో ఆయన స్థానంలో జిష్ణు నాగవిజయ్ ఇంచార్జ్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. సహచర అధ్యాపకులు ఆయన్ని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఏ(పొలిటికల్ సైన్స్), బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ(ఫిజిక్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

'పిల్లలు బడిలోనే ఉండాలి'



మిడుతూరులో మానవహారంగా అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

మిడుతూరు, జూన్ 10: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని బడిపిల్లతో అంగన్‌వాడీ టీచర్లు, అగన్‌వాడీ ఆయాలు మండల కేంద్రం మిడుతూరు ప్రధాన రహదారి వెంబడి ర్యాలీగా తిరిగారు. చిన్న చిన్న కారణాలతో బడికి వెళ్లని బడి ఈడు పిల్లలను గుర్తించి తరిగి పాఠశాలకు పంపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాని మిడుతూరు బస్టాండు ఆవరణంలో మానవహారంగా నిలబడి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, మంగమ్మ, రాధిక, తిరుపతమ్మలు పాల్గొన్నారు.

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరురూరల్ , జూన్ 10: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, ఉపాధ్యక్షుడు సోమన్న కోరారు. మండలంలోని కొత్తరామాపురం గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

గో సంరక్షణ నిధికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఏఈవో

శ్రీశైలం, జూన్ 10: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి సోమవారం నెల్లూరుకు చెందిన సి.భువనేశ్వర రెడ్డి అనే భక్తుడు రూ. 1,50,000 విరాళంగా అందజేశారు. భక్తుడు ఈ విరాళాన్ని దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి ఫణిధర్ ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



బహుమతులతో విజేతలు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 10: నంద్యాలలోని నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమీ, ఆర్‌కే బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన వేసవి శిక్షణా శిబిరాల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. సంయుక్త షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, క్రీడా సమాఖ్య అధ్యక్షడు డాక్టర్ రవికృష్ణ హాజరై వివిధ క్రీడలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ పీజీ కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి, బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ లక్ష్మయ్య, నాగభూషణం, పారిశ్రామికవేత్త ఎల్‌వీ శ్రీకాంత్ అకాడమీ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఏఎస్ఐకి పదోన్నతి

మహానంది, జూన్ 10: మహానంది పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బాలచంద్రుడుకు ఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ డీఐజీ విజయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 జూన్‌లో మహానంది పోలీస్ స్టేషన్‌కు దొర్నిపాడు నుంచి బదిలీపై వచ్చారు. ఈ నెలాఖరులో ఎస్‌ఐగా మహానందిలో బాలచంద్రడు పదవీ విరమణ చేయనున్నారు.

విద్యుద్దీపాలంకరణలో ప్రభుత్వ కార్యాలయాలు



పాణ్యం ఎంపీడీవో కార్యాలయానికి విద్యుద్దీపాలంకరణ

పాణ్యం, జూన్ 10: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు రంగు రంగుల విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి బుధవారం వరకు విద్యుద్దీపాలతో ప్రభుత్వ కార్యాలయాలు అలంకరించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 12 తేదీన జరిగే ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాట్లు చేశామని చెప్పారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలకరించామని చెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయాలను ఆమె పరిశీలించారు. ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు ఎంపీడీవో కార్యాలయాన్ని అధికారులు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలని జడ్పీ ఉన్నతాధికారులు ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయాన్ని, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.



వెలుగోడు ఎంపీడీవో కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

శ్రీశైల రైలు మార్గానికి ప్రయత్నిస్తా: బైరెడ్డి



శ్రీశైల ఆలయం ప్రాంగణంలో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

శ్రీశైలం, జూన్ 10: శ్రీశైలానికి రోజురోజుకు భక్తుల రద్ధీ పెరుగుతోందని రైలు, విమానమార్గానికి ప్రయత్నిస్తానని, తన తనయురాలు ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి కేంద్రానికి లేఖ ఇవ్వనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు, రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన తనయురాలు బైరెడ్డి శబరి కూటమి ఎంపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించినందుకు స్వామి, అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని, అవినీతి పాలనతో రాష్ట్రం గాడి తప్పిందని అన్నారు. మద్యం, ఇసుక, భూముల కేటాయింపులలో భారీ అవినీతి అవకతవకలు జరిగాయన్నారు. వీటిపై విచారణ జరిపించాలని ఆయన వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు మాత్రమే వచ్చాయని, ఇప్పటికైనా జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకుంటే బాగుంటుందని హితువు పలికారు.

'పీహెచ్‌సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'



వైద్యశాల వెనుక పడేసిన మందులను చూపిస్తున్న బీఎస్పీ నాయకుడు

పాములపాడు, జూన్ 10: పాములపాడు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకుడు స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వైద్యశాల వెనుక ప్రదేశంలో మాత్రలు, టానిక్‌లు వందల కొలది సిబ్బంది పారవేశారని అందులో కొన్ని డేటు అయిపోయినవి, మరికొన్ని 2025 వరకు డేటు ఉన్న మందులు ఉన్నాయని చెప్పారు. రోగులకు ఇవ్వడానికి ప్రభుత్వం సరఫరా చేసిన మందులను ఇలా నిర్లక్ష్యంగా పారవేసిన వైద్య సిబ్బందిపై చర్యలు చేపట్టాలని అన్నారు డేటు అయిపోయిన మందులు బహిరంగ నిర్జన ప్రదేశంలో కాల్చివేయాలి కాని అలా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై వైద్యాధికారి గులాబ్బాను వివరణ కోరగా అవి తమవి కావని, ఆదివారం రోజున 104 సిబ్బంది పారవేశారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. వీటిపై సిబ్బందితో విచారిస్తామని తెలిపారు.

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న నగరి శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 10: సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన మార్పుల వల్ల కలిగిన నష్టాలను సరిదిద్ది విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలని నూతనంగా ఏర్పడే ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, నగరి శ్రీనివాసులు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు కోరారు. సోమవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో భారీ మెజారిటీతో గెలుపొందిన కూటమికి జిల్లా శాఖ నుంచి అభినందనలు తెలిపారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఏపీటీఎఫ్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రాథమిక విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టుగా ఉన్న జీవో నెంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. బోధనకు ఆలంకంగా మారిన వివిధ రకాల యాప్‌లను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పుల్లయ్య, మునిస్వామి, పవన్‌కుమార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ అధ్యక్షురాలు రాజీనామా

ఆలూరు/హలహర్వి జూన్ 10: ఆలూరు విశాల పరపతి సంఘం త్రిసభ్య కమిటీ అధ్యక్షురాలు హనుమంతమ్మ తన పదవికి రాజీనామా చేసినట్లు సొసైటీ సీఈవో వెంకట్ రెడ్డి సోమవారం తెలిపారు. వైసీపీ నాయకులు కిశోర్ తల్లి హనుమంతమ్మకు వైసీపీ ప్రభుత్వంలో సొసైటీ చైర్మన్ పదవికి అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుండటంతో వైసీపీకి చెందిన హనుమంతమ్మ రాజీనామాను అధికారులకు అందించారు.

చింతకుంట త్రిసభ్య కమిటీ రాజీనామా

హాలహర్వి మండలం చింతకుంట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, సభ్యులు రాజీనామా చేశారని కార్యదర్శి వీరాస్వామి తెలిపారు. వారి పదవీకాలం ఈ నెల 30న ముగియనుందని, కానీ ప్రభుత్వం మారిపోవడంతో ముందస్తుగా రాజీనామా చేయాలని ఉత్తర్వులు రావడంతో ఈ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు

ఎమ్మార్పీ ధరలకు మించి అధికంగా అమ్మితే చర్యలు

ఆదోని (అగ్రికల్చర్) జూన్ 10: ఆదోని సబ్ డివిజన్‌లో ఎరువులు విత్తనాలు ఎంఆర్పీ ధరలకు మించి అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ బాలవర్ధిని రాజు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ విత్తన డీలర్లు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. పత్తి, మిరప విత్తనాలను అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అధిక ధరలు అమ్మితే ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆదోని టౌన్, జూన్ 10: డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో డివిజన్‌లోని హెల్త్ అసిస్టెంట్లకు సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే డయోరియా, మలేరియా, డెంగీ, క్షయ వ్యాధుల గురించి వివరిస్తూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాల గురించి వివరించారు. ఎంపీహెచ్‌యస్‌లు బాబురాజు, సీతారాముడు, ఇందిరా జోరతి, మేరీ, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ఆరంభం

ఆలూరు, జూన్ 10: ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. బీఏలో కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీలో జూవాలజీ, గ్రూప్‌లు ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, జూన్ 10: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఈ నెల 12న జరగనుందని నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కదిలి జయప్రదం చేయాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు శీనప్పా, శివస్వామి, జిలానీ, గిరి మల్లేష్‌గౌడ్, పాల్ రెడ్డి, హరి రెడ్డి, హనుమప్ప, రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

రైల్వేశాఖ మంత్రిని కలిసిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి


కేంద్ర రైల్వే శాఖ మంత్రితో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి

ఆదోని, జూన్ 10: ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను సోమవారం ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి కలిశారు. నూతన కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించినందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కర్నూలు జిల్లా అభివృద్ధికి తమ ఆశిస్సులు ఉండాలని అభ్యర్థించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, అవకాశం కొద్ది కర్నూలు జిల్లాకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం

మంత్రాలయం, జూన్ 10: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు 50వేల పాఠ్యపుస్తకాలు, 54వేలు నోటు పుస్తకాలు, 10,200 బ్యాగులు పంపిణీకి సిద్ధం చేసినట్లు మంత్రాలయం ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న అన్నారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో జిల్లా నుంచి వచ్చిన పాఠశాలలకు మంజూరైన పుస్తకాలను స్టాక్ పాయింట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేలు అందజేత

ఆదోని (అగ్రికల్చర్) జూన్ 10: పట్టణంలోని శుక్రవారంపేట 40 వార్డులోని జమ్మిమరద రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అంబల్‌దాగే ఈరన్న, సరోజమ్మ దంపతులు రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మాజీ టీడీపీ కౌన్సిలర్ తిమ్మప్ప, అశోక్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరు సేద్యం.. చిన్న రైతు సుభిక్షం



గోనెగండ్ల, జూన్ 10: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు చిరుధాన్యాల సాగు పట్ల మక్కువ చూపుతున్నారు. ఈ సీజన్‌లో నియోజకవర్గ పరిధిలో రైతులు ఆశించిన మేరనే సాగు చేస్తున్నారు. కొర్ర, సజ్జ, రాగులు, జొన్న పంటలను అంతర్ పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలలో ఎక్కువ మంది చిరుధాన్యాలనే ఆహారంగా వాడుతుండటంతో వాటికి మంచి గిరాకీ పెరిగింది. వైద్యులు సైతం చిరుధాన్యాలను వాడాలని చెప్పడంతో ఈ పంటలకు మరింత డిమాండ్ పెరిగింది.

చిరుధాన్యాల సాగు

ఈ ఖరీఫ్ సీజన్‌లో కొర్ర పంటను నియోజకవర్గంలో 400 హెక్టార్‌లు, సజ్జ పంట 300 హెక్టార్లు జొన్న, రాగులు, అట్టు కొర్రలుమరో 300 హెక్టార్‌లలో రైతులు సాగు చేస్తున్నారు.

పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ

చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ పంటలను అంతర్ పంటలుగా సాగుచేస్తారు. ఈ పంటలు క్వింటం ధర రూ. 6వేల నుంచి రూ. 14వేల వరకు పలుకుతుంది. పశువులకు మేతకూడా వస్తుంది. ఈ మేతతో పాడి పశువుల రైతులకు గ్రాసం భారం తగ్గుతుంది. పాడి కూడా పెరుగుతుంది. రైతులు ప్రస్తుతం ఎక్కువగా ఈ పంటల సాగుకు ఇష్టపడుతున్నారు. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, కులుమాల, పెద్దనేలటూరు, చిన్నమరివీడు, చిన్ననేలటూరు, తిప్పనూరు, వేముగోడు, ఎర్రబాడు, హెచ్ కైరవాడి, నందవరం మండలంలో గురుజాల, ముగతి, నందవరం, మిట్టసోమాపురం, పూలచింత, సోమలగూడురు, నది కైరవాడి, ఎమ్మిగనూరు మండలంలోని 10 గ్రామాల్లో ఈ పంటలు అధికంగా సాగు చేస్తున్నారు.

కొర్ర వర్షాధార పంట

కొర్ర పంట కేవలం 100 రోజుల్లో పంట చేతికి అందుతుంది. ఎకరాకు 10, 12 బస్తాలు దిగుబడి వస్తుంది. అన్ని పంటల్లా కొర్ర పంటకు నీటి అవసరం పెద్దగా ఉండదు, కేవలం వర్షం పై ఆధారపడి పంట పండించవచ్చనే ఉద్దేశ్యంతో పంటకు ఎటువంటి పిచికారి మందులు గానీ ఎరువులు అవసరం లేకున్నా భూమిలోని సారాన్ని బట్టి మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సజ్జ, కొర్ర సాగు చేశా

నేను ఒక ఎకరాంలో సజ్జ, కొర్ర పంటలు సాగు చేశాను. ప్రతి ఏడాది సజ్జ, కొర్రను సాగు చేస్తాను. ఈ పంటకు మంచి గిరాకీ కూడా ఉంది. మార్కెట్‌లో ఎప్పుడైన ధర పలుకుతుంది. ఆరోగ్యానికి అవసరం అని చాల మంది ఇంటి దగ్గరకే వచ్చి పండిన కొర్ర, సజ్జలను విడిగా కొనుకొని వెలతారు. పెట్టుబడికూడా పెద్దగా ఉండదు. మంచి లాభాలు వస్తాయి. ఇటీవల ఈ పంటలకు మంచి ప్రచారం వస్తుంది.

- శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె

వేగంగా మధ్వమార్గ్ కారిడార్ పనులు


ఎంటీఆర్ లైన్‌లో కొనసాగుతున్న మధ్వమార్గ్ కారిడార్ పనులు, గతంలో నిర్మించిన మధ్వమార్గ్ కారిడార్

మంత్రాలయం, జూన్ 10: మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మహాముఖద్వారం నుంచి ఎంటీఆర్ లైనులో శ్రీమఠానికి చెందిన రూ.80 లక్షల ఖర్చుతో కారిడార్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మహాముఖద్వారం నుంచి ముఖద్వారం వరకు గత రెండేళ్ల క్రితం మధ్వమార్గ్‌పేరుతో అతి సుందరంగా, ఆహ్లాదకరంగా, కళాత్మకంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం చేపట్టారు. ఈ సుందరమైన కారిడార్ భక్తులను ఆకట్టుకుంటోంది. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు దగ్గరుండి 300 అడుగల పొడవు, 44 అడుగుల వెడల్పుతో సాగుతున్న కారిడార్ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. గతంలో 32 దుకాణాలు ఉండేవి. అయితే, ఇప్పుడు ఒక వైపు 28, మరో వైపు 28 స్తంభాలు ఏర్పాటు చేసి పై అంతస్థు 22 అడుగుల ఎత్తుతో కారిడార్ పనులు సాగుతున్నాయి. ఇదే మార్గంలోనే టీటీడీ కల్యాణ మండపం, స్టేట్ బ్యాంకు మీదుగా ఈ తోరణాలు నిర్మించి మధ్వమార్గ్ కారిడార్ మాదిరిగానే నిర్మాణాలు మొదలెట్టారు. ఇప్పటికే దుకాణాలను తాత్కాలికంగా ముందుభాగం తొలగించి ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆగస్టులో జరిగే రాఘవేంద్రస్వామి ఉత్సవాల నాటికి ఈ కారిడార్ పనులు పూర్తి చేసి పీఠాధిపతి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ దగ్గరుండి నిర్మాణ పనులు చురుగ్గా సాగిస్తున్నారు. ఈ కారిడార్ పనులు పూర్తయితే.. ఆహ్లాదకరంగా కళాత్మకంగా ఆకర్షణీయంగా మంత్రాలయానికి నూతన శోభను తేనుంది.

నీట్ పరీక్షా స్కాంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరపాలి

ఎమ్మిగనూరు రూరల్, జూన్10: నీట్ పరీక్షా స్కాంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరపాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో 67మంది విద్యార్థులకు ఆల్ ఇండియా ఫస్ట్‌ర్యాంకు వచ్చిందన్నారు. ఇందులో ఏడుగురు హర్యానాకు చెందిన వారు ఒకే ఎగ్జామ్ సెంటర్ వారు కావడం, వారికి 720/720 రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అదే సెంటర్‌లో పరీక్ష రాసిన జాన్వి అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెమ్ చేయగా 163 కరెక్ట్ అయ్యాయని అలా చూసుకుంటే ఆమెకు 636 మార్కులు రావాలని కానీ 720/720 ఎలా వచ్చాయని ప్రశ్నించారు. జూన్ 14న విడుదల చేస్తామన్న ఫలితాలను ఎన్నికల కౌంటింగ్ రోజు జూన్ 4న విడుదల చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీఆర్ ఎస్‌వైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పప్పుశెట్టి, రెడ్డి సాయి, నవీన్, మహబూబ్, తారా, సైపుల్లా, మహమ్మద్ లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

పత్తికొండ, జూన్10 : విత్తనాలవిక్రయాలలో ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని పత్తికొండ వ్యవసాయాధికారి వెంకటరాముడు హెచ్చరించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనలు పాటించడలేదన్న రైతుల ఫిర్యాదుపై ఆయన సోమవారం దుకాణాన్ని తనిఖీచేసి స్టాక్, బిల్లుల వివరాలు పరిశీలించి వారికి షోకాజ్‌నోటీస్‌ను జారీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనాలు విక్రయించినప్పుడు కొన్న రైతుపై బిల్లు రాసి అందులో అమ్మిన విత్తనాల రకం వివరాలు, ధరవివరాలు నమోదుచేయాలన్నారు. అయితే సదరు దుకాణదారుడు అమ్మిన విత్తనాలకు ఎలాంటి బిల్లులు ఇవ్వలేదని తనిఖీలో గుర్తించి 1966 విత్తనం చట్టంకింద నోటీసు జారీచేసినట్లు తెలిపారు. అలాగే దుకాణంలో అమ్మేందుకు ఉంచిన రూ 93,480 విలువైన విత్తనాల అమ్మకాలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. నెలరోజులు దుకాణదారుడి లైసెన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా అధికారులకు సిఫార్స్ చేశామన్నారు. దుకాణదారులు బిల్ విషయంలోకాని, విత్తనాల విక్రయాలలోకాని, ఎరువుల విక్రయాలలో కాని ఇబ్బందులు కలిగిస్తే రైతులు నేరుగా తమకు ఫిర్యాదుచేయాలని సూచించారు.

సంక్షిప్తం

2018 పంట నష్ట పరిహారం ఇవ్వాలి

దేవనకొండ ,జూన్ 10 : 2018 పంటనష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకులు మునిస్వామి మాట్లాడుతూ 2018లో తీవ్రమైన కరువొస్తే సీఎం చంద్రబాబు కరువు జిల్లా ప్రకటించారని, అనంతరం ఎన్నికల నేపథ్యంలో జరిగిన పరిణామాలతో జగన్ రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆనాడు జిల్లాలో కేంద్రబృందం పర్యటించినా రైతులకు కరువు డబ్బు జమ చేయకపోవడం జగన్ దుర్మార్గ పాలనకు నిదర్శమన్నారు. అనంతరం డీటీ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు నాగరాజు ,వీరన్న ,రమేష్ ,రాముడు పాల్గొన్నారు.

నిషేధిత బయోలు అమ్మితే కఠినచర్యలు

దేవనకొండ ,జూన్ 10: ప్రభుత్వం నుంచి అనుమతులు లేని నిషేధిత బయో మందులు అమ్మితే కఠినచర్యలు తప్పవని మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాదారులను ఎఓ సురేష్ బాబు సోమవారం హెచ్చరించారు. అమ్మినట్లు తెలిస్తే దుకాణం సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన జీ1 ,జీ2 మందులను విక్రయించుకొవచ్చని పేర్కొన్నారు.

జాతీయ రహదారికి మరమ్మత్తులు

ఆలూరు, జూన్ 10: వర్షాలు కురుస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు మరమ్మతులు చేయించారు.

టీడీపీ నాయకులకు నివాళి

వెల్దుర్తి, జూన్, 10 : వైసీపీ వర్గీయుల చేతిలో దారుణహత్యకు గురైన టీడీపీ కార్యకర్త గిరినాథ్ అంత్యక్రియలు సోమవారం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించారు. గిరినాథ్ భౌతికకాయాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు శివశంకర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, రామళ్లకోట రామకృష్ణాచారి పూలమాలలతో నివాళులు అర్పించారు.

నకిలీ పత్తి విత్తనాలు, పురుగుల మందులను అరికట్టాలి : బీజేపీ

పత్తికొండ టౌన్, జూన్ 10: పత్తికొండ డివిజన్ పరిధిలోని నకిలీ పత్తివిత్తనాలు, పురుగుల మందులను, బయో మందులను అరికట్టాలని బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, బీజేపీ కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఏడీఏకు వినతి పత్రం ఇచ్చారు. అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు గోరంట్ల, కరణం చంద్రన్న, సురేంద్ర, పులికొండ పాల్గొన్నారు.

600 క్వింటాళ్లకు ప్రతిపాదనలు


మద్దికెర, జూన్ 10: మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులకు అవసరమయ్యే 600 క్వింటాళ్ల వేరుశనగకు ప్రతిపాదనలు పంపామని వ్యవసాయశాఖ అధికారి రవి సోమవారం తెలిపారు. లూజు విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్ నాయక్, రాణి, కవిత తదితరులు ఉన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో సిజేరియన్ దోపిడీని అరికట్టాలి

పత్తికొండ టౌన్, జూన్ 10: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అక్రమంగా గర్భిణులకు సాగిస్తున్న సిజేరియన్ ఆపరేషన్ల దోపిడీని అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెద్దయ్య, హనుమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ అధికారులకు ఏఐవైఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యాధికారి తన సొంత ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణులకు నార్మల్ కాన్పులు చేయకుండా అక్రమంగా సిజేరియన్ల ఆపరేషన్లు నిర్వహిస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ప్రైవేటు ఆసుపత్రిపైన, ఇందుకు ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


ఆలూరు, మంత్రాలయంలో కేక్ కట్ చేస్తున్న వీరభద్రగౌడ్, రాఘవేంద్రరెడ్డి


6 : హొళగుంద, ఎమ్మిగనూరు టీడీపీ కార్యాలయంలో బాలయ్య పుట్టిన రోజు వేడుకలు

ఆలూరు/ మంత్రాలయం/హొళగుంద/ఎమ్మిగనూరు జూన్ 10: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా టీడీపీ, బాలయ్య అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆలూరు టీడీపీ కార్యాలయంలో నందమూరి, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కేక్ కట్ చేసి జరుపుకున్నారు. బాలకృష్ణ రాజకీయ, సినీ రంగాల్లో రాణించి ఉన్నత స్థాయి పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. టీడీపీ నేత గిరి మల్లేష్ గౌడ్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు డాక్టర్ నెట్టప్ప పాల్గొన్నారు.

మంత్రాలయం : మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి స్వగృహం మాధవరం గ్రామంలో టీడీపీ అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ వారసుడిగా చిత్రాల్లో రాణిస్తూ రాజకీయాల్లో కల్మశం లేని వ్యక్తిగా బాలయ్యబాబు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని కొనియాడారు.

గుడికల్లు చెరువుకు జలకళ


నీటితో కళకళలాడుతున్న గుడికల్లు చెరువు

ఎమ్మిగనూరు, జూన్10: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లుకు ఆనుకొని ఉన్న గుడికల్లు చెరువు జలకళను సంతరించుకుంది. మొన్నటి వరకు నీరు అడుగంటడంతో వెలవెలబోయి కనిపించింది. వేసవిలో గుడికల్లు చెరువులో నీటిని నిల్వ చేసి ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీరు అందిస్తు వస్తున్నారు. వేసవికాలం చివరికి చేరుకున్న సమయంలో నీరు అడుగంటాయి. దీంతో ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి నీటి ఎద్దడి ఏర్పడకుండ ముందుజాగ్రత్తగా పెద్దకడుబూరు మండలంలోని పులికనుమ చెరువు నుంచి నీటిని ఎల్లెల్సీ కాలువ ద్వారా మళ్లించి చెరువుకు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. అంతేగాక గత వారం రోజులుగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో గుడికల్లు చెరువులోకి భారీగా నీరు చేరి జలకలను సంతరించుకుంది. అంతేగాక పట్టణ సమీపంలోని మంచినీటి చెరువులు సైతం నీటితో కళకళలాడుతున్నాయి.

నారాలోకేశ్‌ను కలిసిన బీవీ,కేఈ


లోకేశ్‌తో కేఈ శ్యాంబాబు

ఎమ్మిగనూరు/పత్తికొండ, జూన్10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారాలోకేశ్‌ను సోమవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ కూర్పు జరుగుతుండడం, ఇదే సందర్భంలో యువనేత నారాలోకేశ్‌ను వీరు కలవడంతో ఎమిగనూరు నియోజకవర్గం నుంచి బీవీకి మంత్రి వర్గంలో చోటుదక్కే అవకాశం ఉందన్న చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, నియోజకవర్గంలో చేయాల్సిన అభివృద్ధిపనులు వంటి అంశాలపై నారాలోకేశ్ మాట్లాడినట్లు కేఈ శ్యాంబాబు తెలిపారు.

బీవీకీ మంత్రి పదవి ఇవ్వాలి: టీడీపీ

నందవరం, జూన్ 10 : ఎమ్మిగనూరు ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీవీ మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం అహర్నిశలు శ్రమించి ఆయన అడుగు జాడల్లో పని చేస్తున్న జయనాగేశ్వరరెడ్డికి మంత్రి పదవి ఇస్తే రాష్ట్రంమరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

జనసేనను బలోపేతం చేస్తాం

మంత్రాలయం, జూన్ 10: నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు జనసేన ఇన్‌చార్జి రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. సోమవారం మంత్రాలయంలో జనసేన పార్టీ కార్యాలయంలో పెద్దకడుబూరు మండలం నియోజకవర్గ జనసేన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సయ్యద్, కరీం, షర్ఫుద్దీన్, మాహబూబ్, వలి, విరేష్, షాషావలి పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి: సీపీఐ

కోసిగి, జూన్ 10: మండలంలో రైతులందరికీ అవసరమైనన్ని సబ్సిడీ విత్తనాలు సక్రమంగా అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు ఎం.గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాయన్న అన్నారు. సోమవారం కోసిగిలో రైతు సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతులకు కేవలం వ్యవసాయ అధికారులు పాసు పుస్తకానికి మూడు బస్తాల విత్తనాలు మాత్రమే అందజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు మండలంలోని రైతులకు అడిగినన్ని వేరుశనగ ఇతర విత్తనాలు సమయానికి సక్రమంగా అందజేయాలని కోరారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ, ఎస్ఐ

వెల్దుర్తి, జూన్, 10 : కర్నూలు సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ మధుసూదన్‌రావు, కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సునీల్ కుమార్ వెల్దుర్తి స్టేషన్ బాధ్యతలు చేపట్టారు. బొమ్మిరెడ్డిపల్లెలో టీడీపీ కార్యకర్త గిరినాథ్ ఆదివారం దారుణహత్యకు గురయిన విషయం తెలిసిందే. ఎన్నికల ఓటింగ్ సమయంలో, ఎన్నికల లెక్కింపు సమయంలో, టీడీపీ గెలిచిన తరువాత మల్లెపల్లె, బొమ్మిరెడ్డిపల్లె, పుల్లగుమ్మి, అల్లుగుండు గ్రామాలలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో అలసత్వం వ్యవహరించిన సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డిను పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు.

అందరికీ న్యాయం చేస్తాం

తుగ్గలి, జూన్ 10: ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం పని చేసిన ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు మంత్రి పదవి ఇవ్వాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని జొన్నగిరి, రామలింగాయపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు విజయోత్సవ సంబరాల్లో భాగంగా ఆయా గ్రామాల నాయకులను, రాష్ట్ర నాయకులను పూలమాలలు వేసి మిఠాయిలు తినిపించి సంబరాలు చేసుకున్నారు.

'ఆసరా' డబ్బులు ఇవ్వరా ?

తుగ్గలి, జూన్ 10: తమ అకౌంటులో డబ్బులున్నా.. బ్యాంకు మేనేజర్ డబ్బులు ఇవ్వడం లేదని మా అకౌంటులో ఉన్న ఆసరా డబ్బులు వెంటనే ఇవ్వాలని మహిళలు రామాంజనమ్మ, మంగమ్మ, సుధ, సీపీఎం మండల అధ్యక్షులు శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి ఏపీజీబీ బ్యాంకు ఎదుట నెల రోజుల క్రితం పడిన ఆసరా డబ్బులు ఇవ్వకుండా బ్యాంకు అధికారులు, మేనేజర్లు ఇబ్బందులు పెడుతున్నారనీ, వెంటనే మా ఆసరా డబ్బులు మాకు ఇప్పించాలంటూ ధర్నా నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆదోని, జూన్ 10: ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ నాగిరెడ్డితో పాటు, వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడు, టీడీపీ సీనియర్ ఉమాపతినాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మీనాక్షినాయుడు వారికి టీడీపీ కండువా వేసి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచు నాగిరెడ్డి మాట్లాడారు. సర్పంచుగా ఎన్నుకున్న నాటినుండి ఇప్పటి వరకు నిధులు లేవన్నారు. పంచాయతీలకు మంజూరైన నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం దొంగలించిందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో సర్పంచులకు మళ్లీ గౌరవం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శివప్ప, అయ్యన్న, బసవరాజు, షణ్ముఖ, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.